జిందగీ
# చింతన
నమస్తే తెలంగాణ హైదరాబాద్
సోమవారం 23 డిసెంబర్ 2024
www.ntnews.com


# క్రీస్తు పుట్టుక నిరీక్షణ ఫలం



**ఏసు అంటే రక్షకుడు.
ఆయన జననం రక్షణోదయం.
ఆ మహనీయుడి పుట్టుక ఒక సంచలనం.
ప్రభువు రాకతో విశ్వాసుల ఎదురుచూపులు ఫలించాయి. క్రీస్తు ఉదయించిన క్రిస్మస్ సందర్భంగా ప్రభువును ప్రస్తుతించుకుందాం.**

దేవుడు ఐదు రోజులపాటు ఈ అందమైన విశ్వాన్ని సృష్టించాడని బైబిలు చెబుతున్నది. ఆరో రోజు ఈ విశ్వం అనుభవానికి మహా మేధా సంపన్నుడిగా మానవుడిని సృష్టించాడు. వారిని, వాటన్నిటినీ చూసి ఆనందించమన్నాడు. ఆ తోట మధ్య ఉన్న చెట్టు ఫలాలు మాత్రం తాకొద్దనీ, తినొద్దని హవ్వా, ఆదాములను హెచ్చరించాడు దేవుడు. 'మంచి చెడ్డల వృక్షమొకటి

బుధవారం క్రిస్మస్



ఉంచినాను ఈ తోట లోపల. ముట్టవలదు ఈ ఫలము మీరలు గట్టి యాజ్ఞ ఇదే!' (రక్షణోదయం) అని ఆజ్ఞాపించాడు. సాతాను సర్పం. హవ్వా, ఆదాముల మధ్యలో ప్రవేశించింది. దేవుడు తినొద్దన్న ఫలాన్ని హవ్వ చేతికి అందించింది. దేవుడి ఆదేశాన్ని మీరారు. మోయలేని మాయ ఇద్దరినీ ఆవహించింది. ఆజ్ఞ మీరిన హవ్వా, ఆదాములు దేవుడి ముఖం చూడలేక దుఃఖ క్రాంతులైపోయారు. తమను రక్షించమని వేడుకున్నారు. పూర్వ భాగ్యం కలుగజేయమని కోరుకున్నారు.

**సాతాను** ప్రభావానికి లోనైన హవ్వా, ఆదాములను దేవుడు మన్నించాడు. సర్పానికి (సాతానుకు) ఘాటైన హెచ్చరికలు చేశాడు. 'నీకునూ (సర్ప సాతానుకు), స్త్రీ (మరియ) సంతానమునకు వైరము కలుగజేసెదను' (ఆది: 3:15) అన్నాడు. ఈ మానవ సంతానానికి దేవుడి రక్షణ కావాలని సూచించారు ప్రవక్తలు. 'ప్రభువు తానే ఒక సూచన మీకు చూపును. కన్యక గర్భవతియై కుమారుని కని అతనికి ఇమ్మానుయేలను పేరు పెట్టును (యెషయా 7:14 )' అని ప్రవచించాడు యెషయా ప్రవక్త. ప్రవక్త మీకా బెత్లెహేం గురించి, దాని భాగ్యం గురించి చెప్పినప్పుడే క్రీస్తు రాక గురించి సూచన జరిగింది. ఆయన వచ్చి మానవాళికి మహా మార్గంగా నిలుస్తాడన్న సూచన జరిగింది. ఇలా సాక్షాత్తూ యెహోవా దేవుడు సూచన చేశాక, ఇర్మియా లాంటి ప్రవక్తలు, మోషే లాంటి విమోచకులు, క్రీస్తుకు ముందు రాజైన దావీదు మహారాజు, భక్తులూ ఎంతో కాలం క్రీస్తు రాకకోసం ఎదురుచూశారు.

**ఆ** నిరీక్షణ ఫలితమే క్రిస్మస్ పర్వం. బెత్లెహేంలో దైవ కుమారుడైన క్రీస్తు ఉదయించాడు. ఒక పశువుల పాకలో కన్యక గర్భం నుంచి జన్మించాడు. పచ్చిక పొలాల్లో తమ పశువులకు కాపలా కాస్తున్న కాపర్లకు దూతలు వచ్చి శుభవార్త చెప్పారు. ఎవరూ నమ్మలేదు. ఆ వెంటనే నీలి నింగిలో ఒక పెద్ద చుక్క పొడిచింది. దానికో పెద్ద తోక. ఈ తోక చుక్క ఉదయించడానికీ, మహాత్ముల జననానికీ చాలా సంబంధాలు ఉన్నాయని దూతలు చెబితే కాపర్లు విన్నారు. అందుకే బెత్లెహేంలో ఏదో జరుగుతుందని హుటాహుటిన వెళ్లారు. మరియ చేతి పొత్తిళ్లలోని శిశువును దర్శించారు. బాలయేసు కాంతి చూసి 'అర్ధరాత్రి సూర్యుడు పొడిచాడా' అని ఆశ్చర్యపోయారు. తమ పేద ఊరిలో ఇదో వింతైన సంఘటన అని ఎగిరి గంతులేశారు.

**'ఇంతటి** మహనీయుడు ఈ పశువులు మేసే కొట్టంలో పుట్టడం ఏమిటా?' అని బాధపడ్డారు. కానీ, యోసేపు, మరియలు పుణ్య దంపతులు. వీరు నజరేతు నివాసులు. జనాభా లెక్కలు రాయించుకోడానికి తమతమ పూర్వికుల ప్రదేశాలకు వెళ్లాలి. ఈ నేపథ్యంలో వీరిద్దరూ తమ పూర్వుల భూమియైన బెత్లెహేం పురానికి వచ్చారు. బెత్లెహేం, నజరేతు మధ్య దూరం 90 కిలోమీటర్లు. నిండు గర్భిణి మరియ. ఒక్క సత్రం కూడా ఖాళీ లేదు. మనసున్న 'మనిషి' కనిపించలేదు. ఆ రాత్రి విషమ పరీక్ష. చేసేది లేక, ఆ దగ్గరలోని పశువుల పాకలోనికి వెళ్లారు. అక్కడే కన్య మరియ ప్రభువుకు జన్మ ఇచ్చింది. ఆ చీకటి రాత్రి కాస్త పట్టపగలల్లే మారిపోయింది. పుట్టగానే వెలుగులు పంచిన ప్రభువు.. ఈ శకానికి కర్త అని విశ్వాసుల నమ్మకం. ఆయన జీవితం ఆదర్శమయం. ఆయన మాటలు సదా స్మరణీయం. క్రీస్తు మార్గం సదా ఆచరణీయం.

...✍ ప్రొ||బెర్నార్డ్ రాజు, 98667 55024

## నాలోని దైవానికి..

**స్వశరీరే స్వయం జ్యోతిః స్వరూపం సర్వసాక్షిణమ్|
క్షీణదోషాః ప్రపశ్యన్తి నేతరే మాయయావృతాః||**
**(అన్నపూర్ణోపనిషత్తు 4-36)**

'**తమ** శరీరమందే స్వయం జ్యోతిగా సర్వసాక్షిగా ప్రకాశించే ఆత్మను.. పాపాలు నశించిన వారే చూడగలరు. మాయ కమ్మేసిన వారు చూడలేరు' అని పై శ్లోకానికి అర్థం. దీనిని బలపరిచే దృష్టాంతాలు పురాణాల్లో కోకొల్లలు. ఆంజనేయుడు తన వక్షస్థలాన్ని చీల్చి.. తన గుండెల్లో కొలువుదీరిన సీతారామ లక్ష్మణులను లోకానికి చూపించాడు. అది పురాణ కాలం. పురాణ పురుషుడు, మహానుభావుడు కాబట్టి అలా చూపించగలిగాడు అనుకోవచ్చు. కానీ, చరిత్రలో చోటు చేసుకున్న ఓ సంఘటన గురించి తెలుసుకుందాం. తమిళనాడులోని శ్రీవిల్లిపుత్తూరులో విష్ణుచిత్తుడు అనే మహా భక్తుడు ఉండేవాడు. ఆయన ప్రతి నిత్యం వటపత్రశాయి అయిన చిన్నికృష్ణుడికి పూలహారాలు అర్పిస్తూ అర్చించేవాడు. ఆయనకు భగవత్ ప్రసాదంగా తులసి తోటలో ఒక చిన్నారి లభించింది. కోదై అంటే పూలమాల. ఆ చిన్నారికి అదే పేరు పెట్టుకున్నాడు. ఆ చిన్నారి శ్రీరంగనాథుడి సేవలో తరిస్తూ గోదాదేవిగా లోకప్రసిద్ధి చెందింది. గోదాదేవి పసితనం నుంచి కృష్ణ భక్తురాలే. తన తండ్రి స్వామి కోసం అల్లిన పుష్పమాలికలను చాటుగా తన మెడలో వేసుకొని అద్దంలో చూసుకొని మురిసిపోయేది. అంటే... అద్దంలో గోదా తనను తాను చూసుకుందని కాదు! తనలోని కృష్ణుడిని చూసుకొని పొంగిపోతుండేది. స్వామి కైంకర్యానికి కట్టిన హారాలు తన కూతురు ముందుగానే మెడలో వేసుకోవడం చూసి




ఆమె తండ్రి ఎంతగానో బాధపడ్డాడు. అలా మదనపడుతున్న విష్ణుచిత్తుడి కలలో శ్రీకృష్ణుడు కనిపించాడు. గోదాదేవి మరెవరో కాదు, భూదేవి అపర అవతారమేనని పేర్కొన్నాడు. ఆమె ధరించిన హారాలు తనకు ప్రీతిపాత్రమని పలికాడు. స్వామి స్వప్న సాక్షాత్కారంతో విష్ణుచిత్తుడు కుదుటపడ్డాడు.
తనలో దేవుడు ఉన్నాడని అనుకోవడం వేరు. తానే దేవుడిని అని భావించడం వేరు. శ్రీరామకృష్ణ పరమహంస అమ్మవారి మీద పూలు చల్లుతూ తన నెత్తిమీద కూడా వేసుకునేవాడట! అంటే నేనే కాళీమాతను అయిపోయానని అనుకోలేదు. తానే దేవుడు అని అస్సలు అనుకోలేదు. తనలో కాళీదేవి ఉన్నదనీ, ఆమెనే పూజిస్తున్నాననీ భావించాడు. ఇలా భావన చేయడం మహామహులకు తప్ప ఎవరికి సాధ్యమవుతుంది? అందుకే సోహమనే భావన కష్టమైనది. దాసోహం అనేది చాలా సులువైనది అంటారు పెద్దలు.

## ఆరోగ్య యోగం

**అధిష్ఠానం తథా కర్తా కరణం చ పృథగ్విధమ్ |
వివిధాశ్చ పృథక్ చేష్టా దైవం చైవాత్ర పంచమమ్||**
**(18-14)**

'**ఏదైనా** సాధించాలంటే ముందుగా శరీరం బాగుండాలి. శరీరంలోని ఆత్మ (విశ్వాసం) పరిపూర్ణంగా ఉండాలి. ఇంద్రియాలు బాగా పనిచేయాలి. ఒక ప్రయత్నం చేసి ఊరుకోకూడదు. వివిధ మార్గాల్లో ప్రయత్నించాలి.




ఇవన్నీ చేసినవారిని దైవం అనుకూలిస్తుంది అన్నాడు' గీతాచార్యుడు. ఇందులోని సూక్ష్మం గ్రహిస్తే అది చదువులో కావొచ్చు, ఉద్యోగంలో కావొచ్చు, జీవితంలో కావొచ్చు.. అనుకున్న లక్ష్యం అందుకోవాలంటే ఆరోగ్యంగా ఉండాలి. కష్టపడితే ఫలితం తప్పకుండా వస్తుందని నమ్మి అలుపెరగని పోరాటం చేయాలి. అప్పుడు విజయం తప్పకుండా వరిస్తుంది.




# గొల్లెతల గీత గోవిందం

**శు**క యోగీంద్రుడు పరీక్షిన్నరేంద్రునితో... రాజేంద్రా! గోప విలాసినులు పలు విధాల పాటలు పాడుతూ, దీనాలాపాలాడుతూ శ్రీకృష్ణ దర్శన లాలస మానసలై ఇలా విలపించారు– కృష్ణా! నీ నవ్వుల పువ్వులు, నీ చూపుల తూపు (బాణా)లు, నానా విధాలైన నీ మధువన విహారాలు, నీ ధ్యానాలు, పరిహాసానికి ఆటపట్టులైన నీ తేనెల ఊటల తేట మాటలు మా మానసాలలో ఘాటుగా నాటుకొని నేడు మరలి పోలేకున్నాయి– మరపురాలేకున్నాయి. మురళీ మనోహరా! త్వరగా తరలి రావయ్యా!

**ఆ|| 'సురత వర్ధనంబు శోకాపహరణంబు
స్వనిత వంశనాళ సంగతంబు
నన్య రాగజయమునైన నీ మధురాధ
రామృతమున దాప మార్పు మీశ!'**

ప్రాణేశ్వరా! ప్రాపంచిక రతుల– ఆసక్తుల పట్ల విరతి– రోత కలిగించేదీ, ఆత్మరతి– పరబ్రహ్మము నందు శ్రద్ధ అపేక్షలను పెంచేదీ, శోకాలను పోకార్చేదీ, అల్లన మ్రోగే కల్లకపటం లేని పిల్లనగ్రోవి ముద్దులందుకొనేదీ, ఇతరాలైన స్వర్గ, సార్వభౌమాది భౌతిక సుఖ సంతతుల (సమూహాల) యందలి ఆసక్తిని సుతరాం– పూర్తిగా అధిగమించ– జయించగలిగేదీ అయిన నీ మధుర అధరామృత పానంచే ఓ పాపనాశకా! ఓపలేని మా విరహ తాపాన్ని చల్లార్చు.

**ఉ|| 'నీ వడవిం బవల్ దిరుగ నీ కుటిలాలక లాలితాస్య మిచ్ఛావిధి జూడకున్న నిమిషంబులు మాకు యుగంబులై చనుం గావున రాత్రులైన నిను గన్నుల నెప్పుడు జూడకుండ లక్ష్మీవర! ఱెప్పలడ్డముగ జేసె నిదేల? విధాత క్రూరుడై'...**

'ఇందిరా రమణా! నీవు పగటిపూట బృందావనంలో తిరగడం వల్ల, ఉంగరాల ముంగురులచే అంగజుని– మన్మథుని అందాలను కూడా భంగపరచే– సందడించే (మించిపోయే) నీ ముఖారవిందాన్ని తనివి తీర తిలకించలేకపోతున్నాం. అందుకే ఓ జార చోర శిఖామణీ! మాకు క్షణాలు యుగాలుగా భారమవుతున్నాయి. పోనీ, రాత్రి వేళలందైనా ఎడ తెగకుండా కన్నుల నిండా నిను కనుగొందామనుకుంటే, ఓ వందారు మందారమా (కాళ్లు మొక్కువారికి కల్పవృక్షమా)! క్రూరుడైన/ మందు (జడు)డైన అరవిందభవుడు బ్రహ్మదేవుడు కళ్లకు ఈ రెప్పలను అడ్డంగా సృష్టించి, తప్పు చేసి గొప్ప ముప్పు తెచ్చిపెట్టాడు కదా!' అక్షుల– కన్నుల కున్న పక్ష్మా– రెప్పల అడ్డం తొలగించుకొని జడ్డుదనం (సోమరితనం) లేక పొందిక (వీలు)గా ఇందీవరశ్యాముని (నల్ల కలువ నిగారింపువానిని) వందించి ఆనందించువాడు దక్షుడు. కానివాడు కనకా(హిరణ్యా)క్షుడు. 'నిర్నిమేషంగా– నిరాటంకంగా యదుపతిని దర్శించుకొనే తీరుగా, తిప్పలు పెట్టే రెప్పలను తీసి అవతల– వేరుగా పెట్టగలిగితే ఎంత బాగుండు' అని అనుకుంటున్నారు అతివలు. గోపభామలది అట్టి నిరామయ– భోగమనే రోగం లేని ఆరూఢ– సిద్ధి పొందిన ప్రేమ! కళ్లకు మూతలు– రెప్పలు అడ్డంగా పెట్టి వ్రేత– గోపికలను వెతలపాలు చేసిన విధాత (సృష్టికర్త)ను మూలంలో వ్యాసుడు జడుడు (మందమతి)గా అధిక్షేపించగా– తెగడగా, పోతన అమాత్యుడు మాత్రం పితామహుని– బ్రహ్మదేవుని 'క్రూరుడు'గా పేర్కొని గాని ఊరడిల్ల లేకపోయాడు!

**క|| 'కట్టా! మన్మథు కోలలు
నెట్టిన నో నాట బెగడి నీ పాదంబుల్
పట్టి కొనగ వచ్చిన మము
నట్టడవిని డించి పోవ న్యాయమె? కృష్ణా!'**

మాధవా! కమ్మవిల్తుని– మన్మథుని అమ్ములు– బాణాలు వమ్ము (వృథా) గాక మమ్ములను గట్టిగా బాధించగా భయపడి తట్టుకోలేక నీ పాదమ్ములు పట్టుకోడానికి వచ్చాము. అట్టి మమ్ము, జగజెట్టి (ప్రసిద్ధ శూరుడ)వైన ఓ నందు పట్టీ!– కన్నయ్యా! నట్టేట ముంచినట్టుగ ఈ చిట్టడవిలో ఇట్టే వదలిపెట్టి వెళ్లడం న్యాయమా?

**మ|| 'అని యిట్లంగన లంచిత స్వరముతో నంకించుచుం బాడుచుం దను 'రావే'యని చీరి యేడువ జగత్త్రాణుండు త్రైలోక్య మోహనుడై మన్మథ మన్మథుండయి మనోజ్ఞాకారియై హారియై ఘన పీతాంబర ధారియై పొడమె దత్కాంతా సమీపంబునన్'**

శుకయోగి– రాజా! 'ఈ తీరుగా ఆ గోప వెలదులు మృదు మధురమైన కంఠస్వరంతో యదుభూషణుని పొగడుచూ, పాడుచూ 'ప్రియతమా! రావయ్యా! కావవయ్యా!' అని పిలుస్తూ విలపించసాగారు. జగద్రక్షకుడైన ఆ జగన్నాథుడు జనార్దనుడు త్రిజగన్మోహనుడై, మన్మథ మన్మథుడై– మదనుని కూడా మోహపెట్టు భువన సుందరుడై, ఆ మందరగిరిధారి మురారి హారియై– అందమైన హారాలు ధరించి, ఘన పీతాంబర ధారియై– పచ్చని పట్టు పుట్టము గట్టి వారి ముందు ఆవిర్భవించాడు. అలా కనిపించిన వల్లభుని శౌరిని గాంచి పల్లవాధరలైన ఆ వల్లవ వెలదులు– గోపికలు, పోయిన ప్రాణాలు వస్తే దేహేంద్రియాలన్నీ చైతన్యవంతాలై విలసిల్లునట్లు, విచ్చిన మోములతో విరాజిల్లారు.' 'మన్మథ మన్మథుండయి'– అందరి డెందాలను తన కళలతో కలవర పెట్టే మన్మథుని మనస్సును కూడా మథించేవాడు కామజనకుడు, కంజలోచనుడు మధురానాథుడైన మధుసూదనుడు! 'కాంతలం గరగించెన్ రతికేళి గృష్ణుడు గృపం గందర్పు బాలార్చుచున్'– 'కందర్పుని దర్ప– గర్వ మణస్తూ త్రైలోక్య సంతర్పి శ్రీకృష్ణుడు గోపకాంతలను కరుణతో కామకేళిలో కరగించాడు' అని మన పోతన తెనిగింపు. 'అయ్యో! నేను కూడా ఒక గోపభామనైతే నాకు కూడా పూర్ణకామత్వం– నిష్కామత్వం లభించి ఉండేది కదా!' అని అనంగుడు, సర్వాంగ సుందరుడు కామదేవుడు అంగలార్చాడట!
శుకుడు– రాజా! మానవతులంతా తమ మనోహరుని– గోవర్ధన ధరుని చుట్టూ మూగిపోయారు. ఆ మోహనాంగులందరూ మదన మోహనుని ఎలాగైనా ముట్టుకొని, ముద్దాడి 'సోహం' భావంతో తన్మయలై, తలమునకలై మురిసిపోవాలని కనువిందుగా మునుముందుకు తోసుకు వస్తున్నారు. నందనందనుని చరణారవిందాలను సందర్శిస్తూ రుచి మరగి, తనివి పొందని సత్పురుషుని వలె, ఒక సుందరి హరి ముఖారవిందాన్ని అవలోకిస్తూ తృప్తి పొందలేకపోయింది. ఒక హేలావతి– విలాసిని అనురక్తితో అంజలించి కుంజవిహారి కెందామర (ఎర్ర కమలం) వంటి అందమైన కేలు (చెయ్యి) పట్టుకుంది. మరో వల్లవి (గోపిక) ప్రాణవల్లభుని పాణిని– హస్తాన్ని తన బుజాన పెట్టుకొని మురిసిపోయింది. వేరొక జాంబూనదాభ– హరణ్యవర్ణ తను వరించిన యదువరుని శ్రీధరుని తాంబూల చర్వితాన్ని (వమితం మధురం శమితం మధురం, మధురాధిపతే రఖిలం మధురం!) తన చేత ధరించి తరించింది. మరొక పంకేరుహాక్షి పంకజాక్షుని పాదపల్లవాలను విరహాగ్నిచే ఉడికిపోతున్న తన ఉరోజాలపై ఉంచుకొని ఇంచుక– రవంత సేద తీరింది. మరొక కొమరాలు– ముద్దుగుమ్మ కనుబొమలు ముడిచి, రస క్రీడా భంగం కలిగించాడు కనుక, కినుక పూని, వేడి పలుకులతో ఆడిపోసుకుంటూ, పెదవి కొరుకుతూ దండించు కైవడి– కొట్టేదానివలె, వాడి– చురుకు చూపులతో వన్నెకాడిని– వెన్న దొంగను చూచింది. ఈమెనే మహాభావ స్వరూపిణి 'ఆరాధనా రూపిణి' యైన 'రాధా మహారాణి'గా మహాత్ములు తమ వ్యాఖ్యానాలలో నిర్ణయించారు.

**ఉ|| 'ఒక్క లతాంగి మాధవుని యుజ్జ్వల రూపము సూడ్కి తీవలం జిక్కగ బట్టి హృద్గతము జేసి వెలిం జనకుండ నేత్రముల్ గ్రక్కున మూసి మేన బులకంబులు గ్రమ్మగ గౌగిలించుచుం జొక్కములైన లోచవుల జొక్కుచు నుండెను యోగి కైవడిన్'**

రాజా! ఒక లతాంగి ఉజ్జ్వలంగా వెలుగొందే నీలమణిని– కజ్జల (కాటుక) గోపాలుని కమనీయ రూపాన్ని తన చూపులనే తీగలతో బంధించి, హృదయంలో నిలిపి, చిలిపి కృష్ణుడు వెలుపలికి రాకుండా కళ్ల తలుపులు– రెప్పలు తటాలున మూసివేసింది. లోలోన కౌగిలించుకొని తనువు పులకించగా మహా యోగీంద్రుని వలె అంతర్ముఖ సమారాధనతో– సొంపైన లోరుచులతో ఆ కాంత సొక్కి (పరవశించి) సోలి (వాలి) పోయింది.

**సీ|| 'ఎలయించి ప్రాణేశ! యెందు బోయితివని, తోరంపుటలుకతో దూఱె నొకతె
జలజాక్ష! నను చూసి చనగ నీ పాదంబు, లెట్లాడెనని వగ నెయిదె నొకతె
నాథ! నీ వరిగిన నా ప్రాణమున్నది, కూర్మియే యిది యని కుందెనొకతె
యీశ్వర! నను నిన్ను నిందాక బాపనే, పాపపు విధి యని పలికె నొకతె'
ఆ|| 'తలగి పోవునట్టి తప్పేమి సేసితి?
నధిప! పలుకు ధర్మ మనియె నొకతె
యేమి నోము ఫలము హృదయేశ! నీ మోము
మరల గంటి మనుచు మసలె నొకతె'**

ప్రాణేశ్వరా! నను కికురించి– మోసగించి ఎక్కడికెళ్లావు?– అని ఒక అన్నువ– చక్కనిది మిక్కిలి కినుక పూని వెన్నుని నిలదీసి నిందించింది. 'కమలాక్షా! నన్ను వీడి వెళ్లడానికి నీకు కాళ్లు ఎలా ఆడాయి' అని మరో వామాక్షి వాపోయింది. 'ముకుందా! నీ వియోగంతో ఇంకా నా ప్రాణాలు నిలిచే ఉన్నాయే! ప్రేమంటే ఇదా?' అంటూ ఒక కుందరదన డెందంలో కుందింది– వగచింది. 'శ్రీకాంతా! ఇంతదనుక దయ ఒకింత లేక పాపపు దైవం– నలువ (విధి) మనలను విడదీసి ఉంచాడు గదా!' అని ఇంకో చెలువ పలవించింది– విలవిలలాడింది. ఒక ఒప్పుల కుప్ప 'ప్రభూ! తప్పించుకుపోయేటంత ఏమి తప్పు చేశానో, ధర్మం చెప్పు' అన్నది. 'ఏ నోము ఫలమో ఇది, ఘనాఘన సుందరా! మరల నిన్ను కనగలిగాను, మన గలిగాను' అని వెను దిరిగి మేను మరచింది ఒక రమణి.

**క|| 'హరి సురుచిర లలితాకృతి
దరుణులు గని ముక్త విరహ తాప జ్వరలై
పరమోత్సవంబు సలిపిరి
పరమేశ్వరు గనిన ముక్త బంధుల భంగిన్'**

ఈ విధంగా భగవంతుని దర్శించి భవ బంధాల నుంచి బయటపడిన భాగవతుల వలె, నంద నందనుని సుందర సముజ్జ్వల స్వరూపం దర్శించిన ఆ ఇందువదనలు అందరూ విరహ తాప జ్వరం తొలగిపోగా పరమానంద భరితలయ్యారు. వారి అంతరంగంలోని అధివ్యాధులు సొంతం అంతరించిపోయాయి. ఎలా? 'వారును జ్ఞానకాండంబున నీశ్వరుంగని శ్రుతులు ప్రమోదంబునం గామాను బంధంబులు విడిచిన విధంబున, హరింగని, విరహ వేదనలు విడిచి, పరిపూర్ణ మనోరథలై'... అని అమాత్యుడు శ్రీధరుని వ్యాఖ్యానాన్ని కూడ తెనిగించి, పరమార్థాన్ని కని తరించండని పాఠకలోకాన్ని కనికరించాడు. శ్రుతులు కర్మకాండను వర్ణించి– వర్ణించి పరమేశ్వరుని మర్మం కనలేక కడకు జ్ఞానకాండ (ఉపనిషత్తుల)ను ప్రతిపాదించి, సమస్త మనోవాంఛలూ అధిగమించి– అతిక్రమించి అకామత్వం– అమనస్కత పొంది కృతకృత్యలైన విధంగా, గోపికలూ గోవిందుని పొందుతో పూర్ణకామలయ్యారు. వాసుదేవునితో గోప వనితల మానసిక మేళనమే రాసలీల! (సశేషం)



తంగిరాల
రాజేంద్రప్రసాద శర్మ
98668 36006

ఇస్లాం బోధ

# అనాథలను ఆదుకుందాం

'**నాన్నా!** నాన్నా! ఒక్కసారి లే నాన్నా. ఫీజు కట్టాలని టీచర్ రోజూ కొడుతున్నారు. రేపు ఫీజు కట్టకపోతే నిన్ను వెంట తీసుకుని రమ్మంటున్నారు' అని ఓ కుర్రాడు మొరపెట్టుకుంటున్నాడు. ఆ రోదనలు అక్కడే తన తండ్రి సమాధిని సందర్శించడానికి వచ్చిన ఓ వ్యక్తి చెవిలో పడ్డాయి. చుట్టూ చూడగా ఓ చెట్టు కింద సమాధి మీద పడి దీనంగా ఏడుస్తున్న బాలుడు కనిపించాడు. ఇంతలో ఆ వ్యక్తి ఫోన్ మోగింది. 'మీరు చెప్పిన పూలు ఫలానా దుకాణంలో మాత్రమే ఉన్నాయి. పైగా ఈ రోజు మార్కెట్‌కు పూలు రాలేదు. అందుకే ధర ఎక్కువ చెబుతున్నారు' అన్నాడు ఫోన్‌లో అవతలి వ్యక్తి. 'నాకు కావలసిన పూలు ఇక్కడే దొరికాయి. నువ్వు మా నాన్న సమాధి ఉన్న శ్మశానానికి వచ్చేయి' అని చెప్పి ఫోన్ పెట్టేశాడు. తన తండ్రి వర్ధంతి సందర్భంగా సమాధిని పూలతో అలంకరించి నివాళులు అర్పించడం అతనికి అలవాటు. అయితే, ఈసారి మాత్రం పూలకు వెచ్చించే సొమ్ముతో ఆ అనాథ బాలుడి ఫీజు కట్టడమే తన తండ్రికి నిజమైన నివాళి అని భావించాడు. వెంటనే ఆ బాలుడి తలపై చేయిపెట్టి 'నేనున్నాన'ని భరోసా ఇచ్చాడు. తనకు ఏ లోటూ రాకుండా చూసుకుంటానని అండగా నిలిచాడు.

అనాథలను ఆదుకోవాలన్నది ఇస్లామ్ ధర్మ ప్రబోధం. అనాథ పిల్లల తలను ఆప్యాయంగా నిమిరితే.. ఆ తలలో ఎన్ని వెంట్రుకలు ఉంటాయో అన్ని పుణ్యాలు మన కర్మల పత్రంలో జమ



అవుతాయని ఇస్లాం చెబుతుంది. అనాథలను ఆదరించాలని ఖురాన్ స్పష్టంగా చెప్పింది. తల్లిదండ్రులు లేని పిల్లల ఆస్తిని కబళించడం మహాపాతకమని హెచ్చరించింది. అనాథల విషయంలో దైవానికి భయపడాలని పేర్కొన్నది.

ఒక వ్యక్తి ఒకసారి మహాప్రవక్త (స)ను కలుసుకొని 'నా కొడుకు మూడు రోజుల నుంచి ఆచూకీ లేకుండా పోయాడు. వాడి తల్లి బెంగతో అన్నపానీయాలు మానేసింది. మా అబ్బాయి క్షేమంగా ఇంటికి చేరాలని అల్లాహ్‌ను ప్రార్థించండి' అని మొరపెట్టుకున్నాడు. అతని బాధకు ప్రవక్త మనసు కరిగిపోయి చేతులెత్తి అల్లాహ్‌ను వేడుకున్నారు. అంతలోనే ఓ వ్యక్తి పరుగుపరుగున వచ్చి 'ఆ తప్పిపోయిన కుర్రాడిని నేను గుర్తుపట్టాను. ఫలానా తోటలో పిల్లలతో ఆడుకుంటున్నాడు' అని చెప్పాడు. ఈ మాటలు విన్నవెంటనే ఆ తండ్రి సంతోషంతో ఆ తోటకు పరుగెత్తబోయాడు. ప్రవక్త (స) అతణ్ని పిలిచి 'చాలా తొందరలో ఉన్నట్లున్నావు. నేను చెప్పేది జాగ్రత్తగా విను; ఆ తోటలోకి వెళ్లాక పిల్లాడిని గుర్తించాక వాడిని పేరుపెట్టి మాత్రమే పిలువు. నాన్నా; కుమారా! అని మాత్రం పిలవకు. అలా పిలిచావంటే అక్కడ ఉన్న పిల్లల్లో అనాథ పిల్లల మనసు నొచ్చుకుంటుంది. చనిపోయిన వాళ్ల అమ్మానాన్నలు గుర్తుకొస్తారు. మా నాన్న కూడా ఉంటే మమ్మల్ని ఇలానే పిలిచేవాడని పసి మనసు గాయపడుతుంది. దుఃఖం పొంగిపొర్లుతుంది. అందుకే మీ అబ్బాయిని పేరుతో పిలిచి ఇంటికి తీసుకెళ్లు' అని సలహా ఇచ్చారు. అంటే అనాథ పిల్లల మనసు కూడా గాయపడకుండా జాగ్రత్త వహించాలన్నది ప్రవక్త ప్రబోధం.

..✍ ముహమ్మద్ ముజాహిద్, 96406 22076